క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి (తూప్రాన్): మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన దొంకెన సత్తమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.2.10లక్షలు మంజూరయ్యాయి. సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వడ్ల నర్సింలు, ఏగొండ, పాపాగౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్సింలు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



పాక వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

శివ్వంపేట(నర్సాపూర్): పశువులు చోరీలకు గురవుతుండటంతో రైతులు పాకల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటున్నారు. మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాకల్లో ఉన్న పశువులను ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు గ్రామానికి దూరంగా వ్యవసాయ పొలాల వద్ద ఉన్న పశువుల పాక వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సోలార్ ద్వారా పనిచేసే సీసీ కెమెరాలకు సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకుని పర్యవేక్షిస్తున్నారు.

గుండెపోటుతో అన్నదాత మృతి



మృతుడు ఎల్లం (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): వరి నాట్ల కోసం పొలం సిద్ధం చేయడానికి వెళ్లిన రైతు వ్యవసాయ భూమిలోనే గుండెపోటుతో కుప్పకూలాడు. ఈ ఘటన మండలంలోని మెల్లూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇస్లాం(పిట్ల) ఎల్లం(52) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వరి నాటడానికి పొలం దున్నించడానికి ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో పొలంలోనే ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. గమనించిన చుట్టూ పక్కల రైతులు, కుటుంబ సభ్యులు ఎల్లంను తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి



ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలిసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఫౌండర్, బీజేపీ నాయకుడు మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ కోరారు. ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆలయం ఆవరణలో ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 11 నుంచి 14 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు సమయానుకూలంగా ఆయా రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తి భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బజరంగ్ సేన యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా నీలకంఠ సంఘం ఎన్నికలు

దుబ్బాక: నీలకంఠ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం రసవత్తరంగా జరిగాయి. వారం రోజులుగా పట్టణంలో హోరాహోరీగా ప్రచారం జరిగింది. ఎన్నికల్లో మొత్తం 636 ఓట్లకు గాను 500 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా బోడ శ్రీహరి తన సమీప అభ్యర్థి మర్గల భూమలింగంపై ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కాల్వ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కాల్వ బ్రహ్మేందర్, సహాయ కార్యదర్శిగా అక్కల రాజేశ్వర్, కోశాధికారిగా తుమ్మ రాజేందర్ గెలుపొందారు. నూతన కార్యవర్గాన్ని సంఘం పెద్దలు అభినందించారు.

యాసంగి సాగేనా?

- నన్నద్ధమవుతున్న రైతులు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆరుతడి పంటలే మేలంటున్న వ్యవసాయాధికారులు



చండూర్‌లో నారుతీస్తున్న కూలీలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): యాసంగి ప్రారంభానికి ముందు వర్షాలు కురవకపోవడంతో సాగు సాధ్యమవుతుందా.. అనే అనుమానం రైతన్న మదిలో కలుగుతోంది. చిలప్‌చెడ్ మండలంలో గత రబీ సీజన్‌లో 12 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సుమారు 10 వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయాధికారుల అంచనా.

మండలంలోని చండూర్, ఫైజాబాద్, గంగారం గ్రామాలకు ఎత్తిపోతల సౌకర్యం ఉన్నప్పటికీ, ప్రస్తుతం అవి వినియోగంలో లేవు. మండలంలోని రైతులు ఎక్కువగా బోర్లపై ఆధారపడి వ్యవసాయం కొనసాగిస్తారు. భూగర్భ జలాలు చాలా వరకు అడుగంటడంతో బోర్లలో కూడా నీరు అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుతం బోరు సహాయంతో సాగు చేసినా, పంట చేతికి వచ్చే సమయానికి బోర్లు ఆగిపోయేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంజీరా పరివాహక ప్రాంత గ్రామాలు గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, చండూర్, చిట్కుల్ గ్రామాల రైతులకు ప్రస్తుతం సాగుకు ఎలాంటి ఇబ్బంది లేదు. మిగతా గ్రామాల రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది.

ఆరుతడి పంటలు వేయాలి..

చిలప్‌చెడ్ మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులకు వ్యవసాయాధికారులు యాసంగి పంటపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సారి పంటకు నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని అందుకు రైతులు ముందు జాగ్రత్తగా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు వరి వైపు మొగ్గు చూపాలన్నారు. రైతులు అజాగ్రత్తగా వ్యవహరించి నష్టపోవద్దని, రైతు భూసార పరీక్షలు చేయించి దానికి తగిన పంటను సాగు చేసుకోవాలని చెప్పారు. కొయ్య కాళ్లల్లో మక్క పంట వేయడం వల్ల ఆధిక దిగుబడి సాధించవచ్చని, దీనికి దున్నకం ఖర్చు ఉండదని, పైగా నీళ్లు తక్కువగా అవసరం ఉంటుందన్నారు. ఈ యాసంగి సీజన్‌లో రైతులు నీటి ఆధారిత పంటలు వేయొద్దని పేర్కొన్నారు.

మినుము వేస్తా



గత యాసంగి సీజన్‌లో వరిసాగు చేసి, మంచి దిగుబడి సాధించాను. ప్రస్తుతం నాకున్న ఐదెకరాల భూమిలో, ఎకరన్నర పొలంలో వరి వేశాను. యాసంగి సీజన్ కావడంతో బోరు నీటి సౌకర్యం తగ్గే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తగా మిగతా భూమిలో మినుము సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, చండూర్

ప్రస్తుతం బోరు నడుస్తోంది



ఆరు ఎకరాల పొలం సాగు చేస్తున్నాను. బోరు సౌకర్యం ఉంది ప్రక్కనే మంజీరా నది ప్రవహిస్తుండడంతో ప్రస్తుతానికి బోరు బాగానే నడుస్తుంది. గత యాసంగిలో కూడా ఇలాగే ఉన్న పంట చేతికి వచ్చే సమయానికి బోరు ఆగిపోయింది. ప్రక్కన ఉన్న రైతులు ఆదుకోవడంతో గట్టెక్కాను. ఈ సారి తక్కువ మొత్తంలో సాగు చేస్తాను.

–మొగులయ్య, రైతు, చిలప్‌చెడ్

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని పలు గ్రామాల రైతులకు యాసంగి పంటపై అవగాహన కల్పించాం .. ఎక్కువగా ఆరుతడి పంటలు వేయాలని సూచించాం. రైతులకు పంటలపై ఏమైనా సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించి పంటలను కాపాడుకోవాలని వివరించాం..

– రాజశేఖర్ గౌడ్, ఏఓ చిలప్‌చెడ్



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు , అప్పటి ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 1999–2000వ బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాలలో పని చేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఆలోచనాత్మకంగా వ్యవహరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. రేగోడ్ పాఠశాలలో విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు అప్పటి టీచర్లు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వక్తలు దాత సంగమేశ్వర్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం సుశీల, పూర్వ ఉపాధ్యాయులు నాందేవ్, నాగేశ్వర్ రావు, బేతయ్య, గోవింద్ రామ్, నరేందర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అంజిబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

హౌసింగ్ బోర్డు రాష్ట్ర కార్యదర్శి రాజేశ్



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న రాజేశ్

చేగుంట (తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని హౌసింగ్ బోర్డు రాష్ట్ర కార్యదర్శి రాజేశ్ పేర్కొన్నారు. ఆదివారం వడియారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలో పేదలకు సంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్, పీడీ మాణిక్యం, డీఈ యాదగిరి, ఎంపీఓ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా పాఠశాల ప్రాంగణం

అసంపూర్తిగా మన ఊరు– మనబడి పనులు



పాఠశాల ఆవరణలో పొదలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం బాలుర ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా మారింది. దీంతో పాములు ఎక్కడ వస్తాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకం కింద నిధులు మంజూరు చేశారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి అసంపూర్తిగానే వదిలేశారు. అలాగే, పాఠశాల ఆవరణలో సంపు నిర్మించేందుకు గంత తవ్వి వదిలేశారు. గుంత చుట్టూ పిచ్చి మొక్కలతో పొదలు వెలిశాయి. దీంతో విషసర్పాలు పాములు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తి పనులు పూర్తి చేయించాలని, పాఠశాల ఆవరణలో ఉన్న పొదలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భక్తులతో ఆలయాల్లో సందడి



కౌడిపల్లి: తునికి నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ నల్లపోచమ్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోశారు. కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేశారు.

ధనుర్మాస పూజలు



కొలువైన లక్ష్మీనర్సింహస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. కొండపైనున్న స్వామివారిని కాలినడకన వెళ్లి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దాత పవన్‌గుప్తా స్వామివారికి వెండిమాలను ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్ గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, సిబ్బంది నర్సింహరెడ్డి, విద్యాకర్‌చారి, తదితరులు ఉన్నారు.



చిన్నశంకరంపేట(మెదక్): కట్ట మైసమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కట్ట మైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో కట్ట మైసమ్మతల్లికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గుండ చెరువు నిండాలని అమ్మవారికి మొక్కుకోవడంతో చెరువు నిండింది. దీంతో అధికారులు నీటిని వదలడానికి అనుమతి ఇవ్వడంతో తూము తీసే ముందు పూజలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి పాడిపంటలు బాగా పండాలని కోరుకున్నట్లు చెప్పారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గోవర్ధన్, కృష్ణాగౌడ్, నర్సింహులుగౌడ్, అంచనూరి రాజేష్, రవీందర్‌గౌడ్, బండారు సిద్దిరాములు, బారి వెంకట్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్: కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరీని భక్తులు దర్శనం చేసు కుని కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, ప్రదక్షిణలు, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'మోడల్' ప్రవేశాలకు ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6 నుంచి పదోతరగతుల్లో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోతరగతిలో వంద సీట్లు, 7,8,9,10వ తరగతుల్లో ఖాళీ అయిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారానే అన్ని సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 14లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా వేదాంత్



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేదాంత్ సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. అమాయక ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, పోలీస్‌శాఖ, తాము కలిసి అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు అవగాహన సమావేశం

రేగోడ్(మెదక్): స్థానిక రైతు వేదికలో సోమవారం ఉ.10 గంటలకు ఆయిల్ పామ్ పంట సాగు యాజమాన్యం, సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఓ జావిద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రైతులు హాజరుకావాలని కోరారు.


సెల్‌ఫోన్ అందజేత



ఫోన్‌ను అందజేస్తున్న ఏఎస్ఐ శంకర్

చిన్నశంకరంపేట(మెదక్): ఫోన్ పోగొట్టుకున్న కొద్ది సేపట్లోనే రికవరీ చేసిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. చేగుంట మండల కేంద్రంలో డ్రైవర్‌గా పనిచేసే రాజస్థాన్‌కు చెందిన బద్రి పని మీద నార్సింగికి వచ్చి ఫోన్ పోగొట్టుకున్నాడు. ఫోన్ పోగొట్టుకున్న విషయం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నూతన టెక్నాలజీతో ఫోన్‌ను గుర్తించారు. పూసల శంకర్ వద్ద ఫోన్ ఉందని గుర్తించి రికవరీ చేసి బాధితుడు బద్రికి నార్సింగి ఏఎస్ఐ శంకర్ అందజేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు ఇస్తున్న నిర్వాహకులు

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన దోజో కరాటే చాంపియన్ షిప్ ఆర్ఎస్ఎస్ కాయ్ తెలంగాణ కప్ పోటీల్లో పెద్దశంకరంపేట మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డైరెక్టర్, కరాటే మాస్టర్ నగేష్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు బహుమతులు సాధించడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అశోక్, పుట్ల పరుశురాం తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కొల్చారం(నర్సాపూర్): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు ఏడుపాయల టీ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎక్కువగా ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు నిబంధనలు అతిక్రమించడం వల్ల జరుగుతున్నాయన్నారు. ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల మృత్యువాత పడ్డారన్నారు. ప్రైవేట్ వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

శివంపేట(నర్సాపూర్): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రం శివంపేటలో ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ శంకర్ ప్రయాణికులకు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్దశంకరంపేట బస్టాండ్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని, జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సునీత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధీనంలో వాహనం



టాటా ఏస్ వాహనం

రామాయంపేట(మెదక్): మండలంలోని దామరచెరువు గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న పురాతన భవనంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. అలికిడి రావడంతో గ్రామస్తులు అక్కడికి వచ్చారు. దీంతో టాటా ఏస్ వాహనాన్ని వదిలి పారిపోయారు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతానికి చెందిన వారై ఉంటారని అనుమానిస్తున్నారు. త్వరలో నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

శిథిల భవనం.. భయం భయం



కౌడిపల్లిలో శిథిలమైన ఎస్టీ హాస్టల్ భవనం

- ఎస్టీ ఆశ్రమ పాఠశాల దుస్థితి
- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): భవనం శిథిలమై ప్రమాదకరంగా ఉందని పలుమార్లు అధికారులకు తొలగించాలని విన్నవించినా సమస్య తీరడం లేదు.. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రం కౌడిపల్లిలో ఎస్టీ ఆశ్రమ పాఠశాల, హాస్టల్ ఉంది. ఇందులో 160మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒకే చోట భవనాలు ఉన్నాయి. ఎస్టీ హాస్టల్ భవనం శిథిలం కావడంతో వినియోగించడం లేదు. పక్కనే ఆశ్రమ పాఠశాల భవనం ఉండటంతో వినియోగిస్తున్నారు. ఈ శిథిల భవనాన్ని తొలగిస్తే ప్రమాదం తప్పడమే కాకుండా విద్యార్థులకు గ్రౌండ్ సౌకర్యం ఏర్పడుతుంది. శిథిలమైన గోడలపై మర్రిచెట్టు మొలిచి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి భవనాన్ని తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఆశ్రమ పాఠశాల సంక్షేమాధికారి జయరాజ్‌ను వివరణ కోరగా.. జిల్లా అధికారులకు చెప్పామని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.



గోడలో మొలిచిన మర్రిచెట్టు